
ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్న మంత్రి శివశంకర్

# దీపావళికి 14వేల బస్సులు

● రవాణా మంత్రి శివశంకర్

చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా స్వస్థలాలకు వెళ్లే వారి కోసం 14,086 బస్సులను నడపనున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. సోమవారం ఉదయం సచివాలయంలో దీపావళికి ప్రత్యేక బస్సులను నడిపే విషయంపై ఆ శాఖాధికారులతో ఆయన సమీక్షించారు. రవాణా శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఫణీందర్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశానంతరం మంత్రి శివశంకర్ విలేకరులతో మాట్లాడుతూ దీపావళి సందర్భంగా ఈ నెల 28 నుంచి 30 వరకు చెన్నై నుంచి రోజూ నడిపే 2092 బస్సులతోపాటు అదనంగా 4900 ప్రత్యేక బస్సులు కలుపుకుని మూడు రోజులూ 11,176 బస్సులను నడుపుతామన్నారు. ఇతర నగరాల నుంచి కూడా ఆ మూడు రోజులూ 2901 ప్రత్యేక బస్సుల చొప్పున మొత్తం 14,086 బస్సులను నడపనున్నట్లు తెలిపారు. దీపావళి పండుగ ముగిసిన తర్వాత స్వస్థలాల నుంచి చెన్నైకి తిరిగివచ్చేవారి కోసం నవంబర్ 2 నుంచి 4 వరకు రోజూ నడిపే 2092 బస్సులతోపాటు 3165 ప్రత్యేక బస్సులు చొప్పున మూడు రోజులపాటు మొత్తం 9441 బస్సులు, ప్రముఖ నగరాల నుంచి ఇతర నగరాల వైపు 3165 బస్సులు చొప్పున మొత్తం 12,606 బస్సులు నడపనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### కిలంబాక్కం నుంచి...

ఇక నగరంలోని మూడు బస్‌స్టేషన్ల నుంచి ఏయే నగరాలకు బస్సులు నడుపుతామనే వివరాలను కూడా ఆయన వెల్లడించారు. కిలంబాక్కంలోని కలైంజర్ శతజయంతి స్మారక బస్‌స్టేషన్ నుంచి పుదుచ్చేరి, చిదంబరం, తిరుచ్చి, మదురై, తూత్తుకుడి, సెంగోట, తిరునల్వేలి, సేలం, కోయంబత్తూరు, వందవాసి, పోలూరు, తిరువణ్ణామలై, కుంభకోణం, తంజావూరు నగరాలకు బస్సులు నడుపుతారు.

### కోయంబేడు నుంచి...

కోయంబేడు బస్‌స్టేషన్ నుంచి ఈసీఆర్, కాంచీపురం, బెంగళూరు, తిరుత్తణి, హోసూరు తదితర నగరాలకు బస్సులు నడుపుతారు.

### మాధవరం నుంచి

మాధవరం బస్‌స్టేషన్ నుంచి పొన్నేరి, ఊత్తుకోట మీదు ఆంధ్రప్రదేశ్‌లోని నగరాలకు వెళ్లే బస్సులతోపాటు, తిరుచ్చి, సేలం, కుంభకోణం, తిరువణ్ణామలై బస్సులు కూడా నడుపనున్నారు. ప్రత్యేక బస్సులలో టికెట్లు రిజర్వేషన్ చేసుకోవడానికి వీలుగా కిలంబాక్కం బస్‌స్టేషన్‌లో 7 రిజర్వేషన్ కౌంటర్లు, కోయంబేడు బస్‌స్టేషన్ 2 రిజర్వేషన్ కౌంటర్లు పనిచేయనున్నాయి. ఇదే విధంగా tnstc official app www.tnstc.in నుంచీ టికెట్లను రిజర్వు చేసుకోవచ్చునని మంత్రి తెలిపారు.

### కంట్రోల్ రూమ్..

ప్రయాణికుల సౌకర్యార్థం బస్సుల వివరాలు తెలుసుకునేందుకు, ఆ బస్సులకు సంబంధించి ఎదురయ్యే సమస్యలపై ఫిర్యాదు చేయడానికి 24 గంటలపాటు పనిచేసే కంట్రోల్ రూంను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బస్సు సర్వీసులకు సంబంధించిన సమస్యలపై నెం.9445014436 ద్వారా కంట్రోల్ రూం అధికారులతో సంప్రదించవచ్చని తెలిపారు. ఇదే విధంగా టోల్ ఫ్రీ నెం. 18004256151కు, నెం.044-24749002, 044-26280445, 044-26281611 లనుంచి ఫోన్ చేసి ఫిర్యాదులు తెలుపవచ్చన్నారు. అనంతరం చెన్నై సచివాలయంలో మహానగర రవాణా సంస్థ మాజీ ఉద్యోగుల వారసులకు కారుణ్య ప్రాతిపదికన ఉద్యోగ నియామక పత్రాలను లబ్ధిదారులకు మంత్రి శివశంకర్ అందజేశారు.

# పగటివేష రాజకీయాలు వద్దు

● బీజేపీ నేతలపై స్టాలిన్ ధ్వజం


వివాహ వేడుకల్లో ఓ వరుడికి మంగళ సూత్రాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత మూడేళ్ల ప్రాచీన ఆలయాలన్నీ కొత్త సొబగులతో కళకళలాడుతున్నాయని, అన్ని శాఖలకంటే దేవాదాయ శాఖలో జరుగుతున్న విప్లవాత్మకమైన మార్పును చూసి నిజమైన భక్తులంతా తమ ప్రభుత్వంపై ప్రశంసల వర్షం కురిపిస్తుండగా, వీటన్నింటిని చూసి ఓర్వలేని వారు భక్తిని పగటి వేష రాజకీయాలకు వాడుకుంటున్నారని బీజేపీ నేతలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పరోక్షంగా ధ్వజమెత్తారు. తిరువాన్మియూరులోని మరుదీశ్వరర్ ఆలయ కల్యాణమండపంలో సోమవారం ఉదయం రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో 31 జంటలకు సామూహిక వివాహాలు జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యమంత్రి స్టాలిన్ ముఖ్య అతిథిగా హాజరై వధూవరులకు శుభాకాంక్షలందజేశారు. దేవాదాయ శాఖ తరఫున సారె పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటైన సభలో ఆయన ప్రసంగిస్తూ... తాను ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలను చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఏయే శాఖలు నిర్వహించిన కార్యక్రమాల్లో అధికంగా పాల్గొన్నానని రెండు రోజులకు ముందు ప్రభుత్వ దస్తావేజులను పరిశీలించానన్నారు. దేవాదాయశాఖ నిర్వహించిన కార్యక్రమాల్లోనే అధికంగా పాల్గొన్నట్లు తెలిసిందన్నారు. దేవాదాయ శాఖ మంత్రిగా పీకే శేఖర్‌బాబు సమర్థవంతంగా పని చేస్తున్నారని, కోట్లాది రూపాయల విలువైన ఆలయ ఆస్తులను న్యాయస్థానాలను ఆశ్రయించి కబ్జాదారుల నుండి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ప్రాచీన ఆలయాలను వాటి ప్రాచీన శిల్పకళా నైపుణ్యానికి భంగం కలుగకుండా మరమ్మతులు చేశామన్నారు. రాష్ట్ర స్థాయిలో ఓ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ సూచనల మేరకే ఆలయాలకు సంప్రదాయ పద్ధతిలో, ఆగమ శాస్త్రాలను అనుసరించి కుంభాభిషేకాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

### ఉభయదారులు, దాతల సాయంతో..

మూడేళ్లలో 2226 ఆలయాల జీర్ణోద్ధరణ పనులు చేపట్టి కుంభాభిషేకాలు నిర్వహించామని, 10,238 ఆలయాల జీర్ణోద్ధరణ పనులు చేపట్టేందుకు అనుమతి జారీ చేశామన్నారు. ఉభయదారులు, దాతలు అందించిన రూ.1103 కోట్లతో 9,163 ఆలయాల మరమ్మతులు ప్రస్తుతం యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. ఈ మూడేళ్లలో 7069 ఎకరాల ఆలయ భూములను కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకున్నామని, ఆ భూముల విలువ రూ.6792లక్షలని చెప్పారు. ఆలయభూములను స్వాధీనం చేసుకున్నందుకు ప్రభుత్వంపై అన్ని వర్గాల వారు ప్రశంసలు కురిపిస్తున్నారని చెప్పారు. ఇక వెయ్యేళ్లనాటి ప్రాచీన ఆలయాల మరమ్మతులకు తమ ప్రభుత్వం 426.62కోట్ల మేరకు నిధులు విడుదల చేసిందని, 2774 ఆలయాల్లో మరమ్మతులు జరుగుతున్నాయని చెప్పారు.

### ధూపదీప నైవేద్యాలు కరువైన...

ఏక కాల పూజలకు కూడా నిధులలేమితో ఉన్న ఆలయాలకు రెండు లక్షలను కేటాయించి ఆ సొమ్ముపై వచ్చే వడ్డీతో ఆ ఆలయాల్లో దీపాలు వెలిగించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని ముఖ్యమంత్రి అన్నారు. 17 వేల ఆలయాలకు రెండు లక్షల చొప్పున డిపాజిట్ చేసేందుకు రూ.200 కోట్లు విడుదల చేశామన్నారు. అంతేకాకుండా ఆ ఆలయాల్లో పనిచేసే అర్చకులకు ప్రతినెలా రూ.1000 గౌరవ వేతనంగా ఇస్తున్నామని తెలిపారు. అరవై యేళ్ల దాటిన వృద్ధులకు తీర్థయాత్రల పథకాన్ని కూడా తమ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ఇప్పటిదాకా 500 మంది రామేశ్వరం, కాశీయాత్రకు వెళ్ళి వచ్చారన్నారు. 1008 మంది వృద్ధులు ఆరుపడై వీడు యాత్రకు వెళ్లారని, 1003 మంది భక్తులు ఆషాఢ మాసంలో అమ్మవారి ఆలయాలను దర్శించుకున్నారన్నారు. ఈ యాత్రలకు దేవాదాయ శాఖ ఉచిత ప్రయాణం, అన్నపానీయాల సదుపాయం కల్పించిందన్నారు. ఈ పురటాసి మాసంలో 1014 మంది భక్తులు వైష్ణవాలయాలకు కూడా తీర్థయాత్రగా వెళ్లారని చెప్పారు.


వధూవరులతో ముఖ్యమంత్రి స్టాలిన్

### ఆలయాల్లో అన్నదానం

రెండు ఆలయాలకే పరిమితమైన అన్నదాన పథకాన్ని తొమ్మిది ఆలయాలకు విస్తరింపజేశామని, 760 ఆలయాల్లో ఏక కాల అన్నదానం అమలు చేస్తున్నామని సీఎం చెప్పారు. ఆలయాల్లో భక్తులు కానుకల రూపంలో చెల్లించిన బంగారాన్నంతా కరిగించి గోల్డ్ డిపాజిట్ స్కీంలో పొదుపు చేసి యేటా వచ్చే 5.79 కోట్ల వడ్డీతో ఆయా ఆలయాల్లో మరమ్మతులు, సిబ్బంది జీతభత్యాలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు.

### అన్ని కులాలు... అర్చకులు

అన్ని కులాలవారు అర్చకులుగా పనిచేసే చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న ఘనత డీఎంకే ప్రభుత్వానికే దక్కుతుందని స్టాలిన్ అన్నారు. తిరుచెందూరు, తిరువట్టారు, శంకరన్‌కోవిల్, వడలూరు, వేలూరు, గంధర్వకోట, కళ్ళకురిచ్చి, తేక్కంపట్టి, మైలాపూరు ఆలయాలపై దాఖలైన అక్రమ కేసులన్నింటినీ చట్ట ప్రకారం ఎదుర్కొని బయటపడేలా చేశామని, ప్రస్తుతం ఈ ఆలయాల్లో ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలన్నీ సాఫీగా జరుగుతున్నాయని, ఆలయ సిబ్బంది అంతా ప్రశాంతంగా పనులు చేసుకుంటున్నారని స్టాలిన్ చెప్పారు. ఇలా రాష్ట్రంలో ద్రావిడ తరహా సుపరిపాలనలో ఆధ్మాత్మిక కార్యక్రమాలన్నీ భారీ స్థాయిలో జరుగుతుండడాన్ని నిజమైన భక్తులంతా మెచ్చుకుంటుండటం చూసి, భక్తిని పగటి వేష రాజకీయాలకు ఉపయోగించుకుంటున్న వారంతా సహించలేకపోతున్నారని స్టాలిన్ పరోక్షంగా బీజేపీ నేతలపై విరుచుకుపడ్డారు. పరాశక్తి చిత్రంలో 'ఆలయాలు ఉండకూడదన్నది మా లక్ష్యం కాదు.. ఆ ఆలయాలు దుష్టులకు నిలయం కాకూడదన్నదే మా లక్ష్యం' అనే కరుణానిధి రాసిన సంభాషణ ప్రకారమే తమ ప్రభుత్వం అన్ని ఆలయాలను నిర్వహిస్తోందన్నారు. ఇక తన సమక్షంలో వివాహాలు చేసుకున్న జంటలు తమకు పుట్టబోయే పిల్లలకు తమిళ పేర్లు పెట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్ముడి, పీకే శేఖర్‌బాబు, ఎం. సుబ్రమణ్యం, రామానుజ జీయర్ స్వామి, దేశిక పరమాచార్య స్వామి, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్. ప్రియ, శాసనసభ్యులు తాయగం కవి, హసన్ మౌలానా, వెట్రి అళగన్, జోసెఫ్ సామువేల్, అరవింద్ రమేష్, ప్రభాకర్ రాజా. పర్యాటక, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ చంద్రమోహన్, దేవాదాయ శాఖ కమిషనర్ పీఎస్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్బంధ హిందీని ఒప్పుకోం

● డిప్యూటీ సీఎం ఉదయనిధి


వధూవరులను శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ సీఎం

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త విద్యా విధానం పేరుతో హిందీ నిర్బంధానికి కుటిల ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ పథకాన్ని అమలుపరిచే ప్రసక్తే లేదని డిప్యూటీ సీఎం ఉదయనిధి పేర్కొన్నారు. దిండుగల్ జిల్లా నందనంలో మాజీ ఎమ్మెల్యే అండి అంబలం కుటుంబ వివాహ వేడుకల్లో ఉదయనిధి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశంలోని పలు న్యాయస్థానాల్లో తనకు వ్యతిరేకంగా దాఖలుచేసిన కేసులను ఎదుర్కొంటున్నానని, ఈ వ్యవహారంలో ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమాపణ చెప్పాల్సిన అవసరం తనకు లేదన్నారు. 1.16 కోట్ల మంది మహిళలకు కలైంజర్ మగలిర్ ఉరిమై ఆర్థిక సాయం పంపిణీ చేస్తున్నామని దరఖాస్తు చేసుకున్న మిగతా వారికి కూడా త్వరలోనే అందిస్తామన్నారు. రాష్ట్రంలో కొంతమంది బలవంతంగా హిందీ భాషను నిర్బంధించే ప్రయత్నాలు చేస్తున్నారని, కొత్త విద్యా విధానం పేరుతో చేపట్టిన ప్రయత్నాలు ఎన్నటికీ ఫలించబోవన్నారు. దివంగత మాజీ సీఎం అన్నాదురై నామకరణం చేసిన తమిళనాడు పేరు మార్చాలని చేసిన ప్రయత్నాలు రాష్ట్ర ప్రజల నుంచి వచ్చిన తీవ్ర అభ్యంతరాలతో వెనక్కి తీసుకున్నారని ఉదయనిధి పేర్కొన్నారు.

# నటి గౌతమికి అన్నాడీఎంకే ప్రచార పదవి


ఈపీఎస్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సినీ నటి గౌతమి

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నుంచి వైదొలిగి అన్నాడీఎంకేలో చేరిన సినీ నటి గౌతమికి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పార్టీ ప్రచార విభాగం ఉప కార్యదర్శిగా నియమించారు. పార్టీ మైనార్టీ విభాగం ఉప కార్యదర్శిగా ఫాతిమా అలీ, వ్యవసాయ విభాగం ఉప కార్యదర్శిగా సన్యాసి నియమితులయ్యారు. కాగా, అన్నాడీఎంకేలో అతి కీలకమైన పదవిగా భావిస్తున్న ప్రచార విభాగానికి సుదీర్ఘ అనుభవం ఉన్న వారికి మాత్రమే కేటాయించడం ఆనవాయితీ. ఆ రీతిలో ప్రచార డిప్యూటీ సెక్రటరీ పదవి నటి గౌతమిని వరించింది.

## ఆర్ఎస్ఎస్‌వాదిగా గర్వపడుతున్నా

కేంద్ర మంత్రి మురుగన్

అడయార్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో ఆర్ఎస్ఎస్ ముఖ్య పాత్రను పోషిస్తుందని, అలాంటి ఆర్ఎస్ఎస్‌వాదిగా గర్వపడుతున్నట్టు కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి మురుగన్ ఒక ఆర్ఎస్ఎస్‌వాది అని, అరుంధతీయ వర్గానికి చెందిన ప్రజల కోసం ఆయన పోరాటం చేసిన దాఖలాలు ఉన్నాయా? అని డీపీఐ ప్రధాన కార్యదర్శి తొల్ తిరుమావళన్ ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు మంత్రి మురుగన్ సమాధానమిస్తూ... దేశాభివృద్ధిలో ఆర్ఎస్ఎస్ కీలక భూమికను పోషిస్తోందన్నారు. ఒండివీరన్, కుయిలి వంటి వారికి తిరుమావళన్ ఎందుకు నివాళులర్పించడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఒక్కరంటే ఒక్క అరుంధతీయుడికి కూడా సీటు ఇవ్వలేదని ఎందుకని ప్రశ్నించారు. అరుంధతీయులకు ప్రత్యేక కోటా కేటాయించింది భారతీయ జనతా పార్టీ అని మంత్రి గుర్తు చేశారు. అణగారిని షెడ్యూల్ తెగల ప్రజలకు రిజర్వేషన్లు అక్కర్లేదని తిరుమావళన్ భావిస్తున్నారా? అని నిలదీశారు. అరుంధతీయుల రిజర్వేషన్ల గురించి మాట్లాడే అర్హత ఆయనకు ఏమాత్రం లేదని మురుగన్ మండిపడ్డారు.

# ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

డీజీపీ శంకర్ జీవాల్ నివాళి - 126 తూటాలు పేల్చి శ్రద్ధాంజలి

అడయార్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 213 మంది పోలీసు అమర వీరులకు రాష్ట్ర డీజీపీ శంకర్ జీవాల్‌తో పాటు ఇతర పోలీస్ ఉన్నతాధికారులు నివాళులర్పించారు. 126 తూటాలను పేల్చి ఘన నివాళి అర్పించారు. భారత్ - చైనా సరిహద్దుల్లో ఇరు దేశాల సైనికుల మధ్య జరిగిన ఘర్షణల్లో పదుల సంఖ్యలో సైనికులు ప్రాణాలు కోల్పోయారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఈ సైనికులను స్మరించుకునేలా యేటా అక్టోబరు 21న అమరవీరుల సంస్మరణ దినాన్ని పాటిస్తున్నారు. ఆ ప్రకారంగా విధి నిర్వహణలో ఉంటూ దేశవ్యాప్తంగా 213 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. వీరిని స్మరించుకునేలా మైలాపూర్‌లోని డీజీపీ కార్యాలయ ప్రాంగణంలో అమరవీరుల సంస్మరణ స్థూపం వద్ద సోమవారం ఉదయం డీజీపీ శంకర్ జీవాల్, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు నివాళులర్పించారు. చెన్నై నగర పోలీస్ కమిషనర్ అరుణ్, శాంతి భద్రతల విభాగం ఏడీజీపీ డేవిడ్సన్ దేవాశీర్వాదంతో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


మెరీనా బీచ్ డీజీపీ ఆఫీసు వద్ద పోలీసు అమర వీరుల స్మారక స్తూపం వద్ద పుష్ప వలయం ఉంచి నివాళులర్పిస్తున్న డీజీపీ



# సిగ్నళ్ల వద్ద సీసీ కెమెరాలు

● కవరపేట ప్రమాదం ఎఫెక్ట్

దక్షిణ రైల్వే భద్రతా విభాగం

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రమాదాలను నివారించే దిశగా ప్రధాన రైలుమార్గాల్లో సీసీ కెమెరాలు అమర్చనున్నట్టు దక్షిణ రైల్వే భద్రతా విభాగం కమిషనర్ ఎం.ఈశ్వరరావు పేర్కొన్నారు. చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తిరువళ్లూర్ జిల్లా కవరపేటలో ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో కుట్ర జరిగిందని విచారణలో స్పష్టమైందని తెలిపారు. ఆ ప్రాంతంలోని రైలు పట్టాల్లో బోల్టులు ఊడదీసినట్లు విచారణలో తేలిందన్నారు. అందువల్ల ఇలాంటి విధ్వంస సంఘటనలు అడ్డుకొనేలా ప్రధాన రైలు మార్గాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు రైల్వే శాఖ నిర్ణయించిందని తెలిపారు. తొలి విడతగా 10 రైల్వేస్టేషన్ల పరిధిలో తలా 4 కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఈశ్వరరావు పేర్కొన్నారు. రైలు పట్టాల ట్రాక్‌లను మార్చే ప్రాంతాల వద్ద ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రైలు ప్రమాదాలను నిరోధించేందుకుగాను పట్టాల నిర్వహణ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులను వీలైనంత త్వరగా భర్తీ చేయాలని కూడా దక్షిణ రైల్వే అధికారులు భావిస్తున్నారు. పట్టాల నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టు కార్మికులకు అప్పగించకూడదని, నైపుణ్యం కలిగిన రైల్వే కార్మికులకే అప్పగించాలని కార్మిక సంఘాల డిమాండ్ చేస్తున్నాయి. రైలు మార్గంలో ఉన్న కాంక్రీట్ స్లీపర్లు, ప్లేట్లు, బోల్టులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడానికి 14 కి.మీల దూరం పాటు నడిచి వెళ్లి తనిఖీ చేస్తున్నారు. ఈ పనులకు కాంట్రాక్టు కార్మికులకు అప్పగించకుండా పర్మనెంట్ రైల్వే కార్మికులనే నియమించాలని పట్టుబడుతున్నారు.


తంజావూరులోని పెట్రోలు బంక్ వద్ద ప్రచారం చేస్తున్న నిర్వాహకులు

# తమిళ తల్లి ప్రార్థన తప్పుల్లేకుండా పాడితే పెట్రోలు ఉచితం

స్వచ్ఛంద సంస్థ వినూత్న ప్రచారం

అడయార్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా తమిళ తాయి ప్రార్థనా గీతం వివాదం సాగుతుండగా, తంజావూరుకు చెందిన జ్యోతి అనే స్వచ్ఛంద సంస్థ ఒక వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టింది. తమిళ తాయి ప్రార్థనా గీతాన్ని ఎలాంటి తప్పులు లేకుండా పూర్తిగా ఆలపించి, హెల్మెట్ ధరించిన మోటరిస్టులకు రెండు లీటర్ల పెట్రోల్ ఉచితంగా అందిస్తామంటూ ప్రచారం చేస్తోంది. డీడీ తమిళ్ చానెల్‌లో హిందీ మాసోత్సవాల్లో భాగంగా పాల్గొన్న గవర్నర్ రవి తమిళ తాయి ప్రార్థనా గీతంలో 'ద్రావిడ నల్ తిరునాడు' అనే పంక్తులను వదిలిపెట్టి, ప్రార్థనా గీతాన్ని ముగించారు. ఇది పెద్ద చర్చనీయాంశంగాను వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో తంజావూరుకు చెందిన జ్యోతి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు హెల్మెట్ ధరించి వచ్చే ద్విచక్ర వాహనదారులు తమిళ తాయి ప్రార్థనా గీతాన్ని ఎలాంటి దోషాలు లేకుండా పూర్తిగా ఆలపిస్తే 2 లీటర్ల పెట్రోల్ ఇస్తామంటూ ప్రచారం చేస్తున్నారు. ఈ పోటీల్లో 25 మంది వాహనదారులు విజేతలుగా నిలవడంతో వారికి 2 లీటర్ల చొప్పున పెట్రోల్‌ను ఉచితంగా అందజేశారు.

# పుదుచ్చేరిలో అధికమైన లంచగొండితనం

● చెన్నై సీబీఐ ఆఫీసుకు ఫిర్యాదుల వెల్లువ




పుదుచ్చేరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి రాష్ట్రంలో అవినీతి, లంచగొండితనం అధికం కావడంతో వీటికి సంబంధించిన ఫిర్యాదులను అక్కడి అవినీతి నిరోధక విభాగంలో సమర్పించకుండా చెన్నైలోని సీబీఐ కార్యాలయానికి పంపుతున్నారు. లంచగొండితనం నిరోధించేందుకు పుదుచ్చేరిలోనే అవినీతి నిరోధక విభాగం ప్రధాన కార్యాలయం ఉంది. అయితే ఆ కార్యాలయంలో ఫిర్యాదులు ఇవ్వకుండా ఏకంగా చెన్నైలోని సీబీఐ కార్యాలయానికి పంపుతున్నారు. దీంతో పుదుచ్చేరిలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై సీబీఐ దేవ్ కన్నుతో తీవ్ర నిఘా వేస్తోంది. సెప్టెంబరులో పుదుచ్చేరి కాలుష్య నియంత్రణ మండలిలో ప్రైవేటు పరిశ్రమలు ప్రారంభించేందుకు లంచమడుగుతున్నట్టు సీబీఐకి ఫిర్యాదు వచ్చాయి. దీంతో చెన్నైనుంచి సీబీఐ అధికారులు హుటాహుటిన అక్కడికి వెళ్లి అన్నానగర్ గృహనిర్మాణ సంస్థ కార్యాలయం ప్రాంగణంలోనే ఉన్న కాలుష్య నియంత్రణ మండలి సంస్థలో దాడులు నిర్వహించారు. ఆ సందర్భంగా శ్రీనివాస రావు అనే అధికారి, బ్రోకర్ రమేష్ కన్ననిని అరెస్టు చేశారు. ఇరువురి వద్ద రూ.2.50లక్షల సొమ్ము పట్టుబడింది. ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం లాగే మరిన్ని శాఖలకు చెందిన కార్యాలయాల్లోనూ లంచగొండితనం అధికంగా ఉందంటూ సీబీఐకి ఫిర్యాదులు వెల్లాయి. విద్యుత్ శాఖ, రవాణా శాఖ, నగరాభివృద్ధి శాఖ, తాలూకా కార్యాలయాలు, రిజిస్ట్రేషన్ శాఖ తదితర శాఖలకు చెందిన కార్యాలయాల్లో లంచం లేనిదే పనులు జరగడం లేదని ఫిర్యాదు వచ్చాయి. ఈ నేపథ్యంలో విల్లియనూరు కమ్యూనిటీ కార్యాలయ కన్యూటర్ ఆపరేటర్ సంపాదనకు మించి అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్టు సీబీఐ కేసు నమోదు చేసింది. పుదుచ్చేరిలోని ఏసీబీ కార్యాలయంలో ఫిర్యాదులు చేయడానికి బదులు ఏకంగా చెన్నైలోని సీబీఐ కార్యాలయానికే ప్రజలు ఫిర్యాదులు పంపుతున్నారంటే ఏసీబీ పనితీరు బాగా లేదని సుస్పష్టమవుతోందని ఆ రాష్ట్రానికి చెందిన సంఘసేవకులు చెబుతున్నారు. పదేళ్లుగా ఏసీబీలో వేలకొద్దీ స్వీకరించిన ఫిర్యాదులలో 15 ఫిర్యాదులపైనే ఇప్పటి వరకూ కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. దీనిని బట్టి అక్కడి ఏసీబీపై ప్రజలలో నమ్మకం సన్నగిల్లిందనే రుజువవుతోందన్నారు. నకిలీ సర్టిఫికెట్తో ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన ఉన్నతాధికారులపై ఏసీబీ కేసులు నమోదు చేసిన 20 యేళ్లు గడిచినా విచారణ ఇంకా కొలిక్కిరాలేదు. మొత్తానికి సామాన్య ప్రజలు సమర్పించే ఫిర్యాదులపై పుదుచ్చేరి ఏసీబీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఈ సంఘటనలు చెబుతున్నాయంటూ సంఘసేవకులు పేర్కొన్నారు. ఏసీబీ కార్యాలయంలోనే అవినీతి అక్రమాలు అధికమయ్యాయంటూ జీవీలు పుదుచ్చేరి ప్రజలు సీబీఐకి ఫిర్యాదు చేయడం గమనార్హమన్నారు. ఈ పరిస్థితులలో ఏసీబీ అధికారులు పుదుచ్చేరిలో వరుసగా ఆకస్మిక దాడులు జరిపేందుకు సన్నద్ధమవుతున్నారు.

## సమాచార దర్శిని

### జలాశయాల్లో 141 టీఎంసీల నీటినిల్వలు

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 90 జలాశయాల్లో 141 టీఎంసీల నీటి నిల్వలున్నట్టు నీటిపారుదల శాఖ పేర్కొంది. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో 90 జలాశయాలుండగా, వాటి పూర్తి సామర్థ్యం 224 టీఎంసీలు. వాటిలో మెట్టూరు, భవానీసాగర్, ముల్లైపెరియార్‌సహా 15ప్రధాన జలాశయాల సామర్థ్యం 198 టీఎంసీలు. ఈశాన్య రుతుపవనాల తాకిడి, సాగునీరు, కర్నాగారాల అవసరాలను భర్తీ చేస్తున్నాయి. ప్రస్తుతం సేలం మెట్టూరు జలాశయంలో 60.8 టీఎంసీలు, ఈరోడ్ భవానీసాగర్‌లో 21, కోవై పరంబికులంలో 13.1, సోలయారులో 5.03 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పలు జలాశయాల్లోకి నీరు చేరాయి.

### చెన్నైలో 12 శాతం పెరిగిన ఇళ్ల విక్రయాలు

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలో గడిచిన ఆరు నెలల్లో ఇళ్ల విక్రయాలు 12 శాతం పెరిగాయి. ఈ మేరకు ఇండియా రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ చెన్నై విభాగ అధ్యక్షుడు ఎమమ్మద్ అలీ వెల్లడించారు. ఉత్తర, దక్షిణ చెన్నై ప్రాంతాల్లో ప్రజలు కొత్త ఇళ్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. రూ.కోటి విలువైన ఇళ్ల కొనుగోళ్లు అధికమయ్యాయని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి అర్ధవార్షికంలో 7,975 ఇళ్లు విక్రయమయ్యాయని, గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 12 శాతం అధికమన్నారు. ప్రస్తుత పరిస్థితులు రియల్ ఎస్టేట్‌కు అనుకూలంగా ఉందన్నారు.

### సిద్ధ, ఆయుర్వేద కోర్సుల అడ్మిషన్ కౌన్సెలింగ్ ప్రారంభం

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుంబాక్కంలోని సిద్ధ ఆస్పత్రి ప్రాంగణంలో ప్రస్తుత విద్యా సంవత్సరం సిద్ధ, ఆయుర్వేద కోర్సుల్లో విద్యార్థుల అడ్మిషన్ కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభమైంది. 17నుంచి 26వ తేదీ వరకు జరగాల్సిన కౌన్సెలింగ్ చెన్నైకి బారీవర్ష సూచన కారణంగా ఈనెల 21వ తేదీకి వాయిదాపడిన విషయం విదితమే. ఈక్రమంలో తొలిరోజున ప్రత్యేక విభాగం, 7.5 శాతం కోటా సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈనెల 22న మంగళవారం నుంచి 29వ తేదీ వరకు జనరల్ విభాగం కౌన్సెలింగ్ జరుగనుందని, www.tnhealth.tn.gov.inలో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

### గత నెలలో 1.50 లక్షల వాహనాల రిజిస్ట్రేషన్

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత నెలలో 1.50 లక్షల వాహనాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఆ మేరకు ఆటోమొబైల్ డీలర్స్ సంఘాల సమాఖ్య విడుదల చేసిన ప్రకటనలో.. రాష్ట్రంలో సెప్టెంబరులో 1,22,927 ద్విచక్రవాహనాలు, 4,420ఈబీల, 6,184 వాణిజ్య వాహనాలు, 22,323ప్యాసింజర్ వాహనాలు, 2,340 ట్రాక్టర్లు అని మొత్తం 1,58,194 వాహనాల రిజిస్ట్రేషన్లు జరిగాయి. అదే గత ఏడాది సెప్టెంబరులో 1,51,854 వాహనాలు రిజిస్ట్రేషన్ కాగా, గత ఏడాదిలో పోల్చితే ఈ ఏడాది 4.18 శాతం అదనంగా వాహనాల రిజిస్ట్రేషన్ జరిగిందని సమాఖ్య తెలిపింది.

### రెండు జిల్లాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూర్, కళ్లకుర్చి జిల్లాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రభుత్వం టెండర్లు విడుదల చేసింది. రాష్ట్రంలో క్రీడాంగణానికి ప్రోత్సాహం అందించేలా తిరుపత్తూర్, రాణిపేట, కళ్లకుర్చి, చెంగల్పట్టు, తెన్‌కాశి, మైలాడుతురై జిల్లాల్లో రూ.90 కోట్లతో అన్ని వసతులతో ఒకేసో, ఇండోర్ స్టేడియంలతో కూడిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయనున్నట్టు శాసనసభ సమావేశాల్లో క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి ప్రకటించారు. ఈ మేరకు తొలివిడతగా తిరుపత్తూర్, కళ్లకుర్చి జిల్లాల్లో ఈ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. టెండర్లు ఖరారైన సుమారు 450 రోజుల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉంటుంది.

### టాస్మాక్ ఉద్యోగులకు దీపావళి బోనస్

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ ఉద్యోగులకు దీపావళి బోనస్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఈనెల 31వ తేదీ ప్రజలు దీపావళి పండుగ జరుపుకోనున్నారు. రాష్ట్రప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులకు దీపావళి బోనస్‌ను ప్రభుత్వం ప్రకటిస్తోంది. ఆ ప్రకారం, టాస్మాక్ సంస్థలో పనిచేస్తున్న సి, డి విభాగ ఉద్యోగులకు 20 శాతం బోనస్ అందజేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకారం, టాస్మాక్ ఉద్యోగులు గరిష్ఠంగా రూ.16,800 వరకు బోనస్ అందుకోనున్నారు.

### సైదాపేట సంత రూ.24 కోట్లతో ఆధునీకరణ

పెరంబూర్, అక్టోబరు 21: స్థానిక సైదాపేటలోని వందేళ్ల ప్రాచీన సంతను రూ.24 కోట్లతో ఆధునీకరించనున్నారు. ఈ సంతలో పండ్లు, కూరగాయలు, చేపలు, చిల్లర సరుకుల దుకాణాలున్నాయి. ఈ ప్రాంతంలోని భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో, దానికి బదులుగా కొత్త దుకాణాల సముదాయం నిర్మించాలని కార్పొరేషన్ నిర్ణయించింది. ఎకరా విస్తీర్ణంలో పార్కింగ్, పండ్లు, కూరగాయల దుకాణాలకు ప్రత్యేక స్థలం, టాయిలెట్లు, మంచినీరు తదితర మౌలిక వసతులు సహా 200 దుకాణాలు ఏర్పాటుకానున్నాయి. ప్రస్తుతం ఆధునికీకరణ సంబంధించిన ప్రాజెక్ట్ ప్రణాళిక సిద్ధం చేసి, ప్రభుత్వ అనుమతులకు పంపారు. అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు ఆహ్వానించి 2026లోపు నిర్మాణాలు పూర్తిచేయాలని నిర్ణయించారు. కాగా, గత 1996లో చెన్నై కార్పొరేషన్ మేయర్‌గా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్ ఫుట్‌పాత్ వ్యాపారులు ఈ ప్రాంతంలో శాశ్వత దుకాణాలు ఏర్పాటుకు అనుమతించారు.



వేలూరు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

### పోలీసుల పిల్లలకు విద్యా సహాయ నిధులు

వేలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2023-24వ విద్యా సంవత్సరంలో 10, 12 తరగతుల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన పోలీసుల పిల్లలకు విద్యా సహాయ నిధులు అందించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 20 మంది విద్యార్థులకు మొత్తం రూ.1.23 లక్షలను ఎస్పీ మదివానన్ అందించి అభినందించారు.

### ఫ్యామిలీ సెలూన్ ప్రారంభం

వేలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణా నగర్‌లో ఫ్యామిలీ సెలూన్‌ను ఎమ్మెల్యే కార్తికేయన్, బిషప్ లూర్ధుస్వామి రిబ్బన్ కత్తిరించి దుకాణం ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ సుజాత, దుకాణ యజమానులు ఆరుళ్‌రాజ్, మేరీ, జాయ్, వినీత్, శరణ్యా ప్రవీణ్, అవినాష్, వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు.



సెలూన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కార్తికేయన్

### ఏపీజే ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

వేలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్కాడులో ఉన్న ఏపీజే ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని వక్తలు కొనియాడారు. ఆంధ్ర రాష్ట్రం తిరుపతి రోటరీ క్లబ్, తిరుపతి కలాం ట్రస్ట్ సంయుక్తంగా ఏపీజే ట్రస్ట్ అధ్యక్షుడు గోపికి 'కలాం' బిరుదు ప్రదానం చేశారు. ఈ పురస్కారాన్ని ఇస్రో శాస్త్రవేత్త లక్ష్మణకుమార్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో తిరుపతి కలాం ట్రస్ట్ వ్యవస్థాపకుడు బాషా సహా నిర్వాహకులు పాల్గొన్నారు.



గోపికి పురస్కారం అందజేస్తున్న తిరుపతి ట్రస్ట్ నిర్వాహకులు

### వేతన బకాయిలిప్పించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు వచ్చిన కార్మికులు

వేలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టు తాలూకా పళ్లికొండలో ఫ్లోర్ ఫుట్‌వేర్ పేరుతో పరిశ్రమ నడుస్తోంది. ఇక్కడ పనిచేసే కార్మికులకు 96 నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని తెలిసింది. ప్రస్తుతం ఆ కర్మాగారం మూతపడింది. కర్మాగారం మూతపడేసే సమయంలో వేతనాలు ఇస్తామని యాజమాన్యం హామీ ఇచ్చినా నేటికీ వరకు వేతనాలు అందించలేదని కార్మికులు వాపోతున్నారు. ఈనేపథ్యంలో, సోమవారం కలెక్టర్ సుబ్బులక్ష్మిని కలిసిన కార్మికులు, యాజమాన్యంతో మాట్లాడి తమకు వేతన బకాయిలు అందించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

### హోలీక్రాస్ పాఠశాల వజ్రోత్సవం

వేలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్తువాచేరిలోని హోలీక్రాస్ మెట్రిక్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలు సోమవారం జరిగాయి. వేడుకలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లూర్ మేరీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్ అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వేలూరు శశికుమార్, గణేష్‌శంకర్, చక్రవర్తి, సుదాకర్, రీగన్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్

### రక్తదాన శిబిరానికి స్పందన

వేలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాస్పత్రి, వేలూరు ప్రభుత్వ వైద్యకళాశాల, విల్లుపురం మహాలక్ష్మి గ్రూప్ కంపెనీల సంయుక్తంగా కొత్త బస్టాండ్ సమీపంలోని కల్యాణ మండపంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశాయి. రమేష్ గుప్తా జ్ఞాపకార్థం ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని ప్రవీణ్ శేషాద్రి ప్రారంభించగా, 110 మంది రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రి బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు.



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న నిర్వాహకులు

### నేడు స్టాలిన్ నామక్కల్ పయనం

చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు, కొత్తగా చేపట్టనున్న పథకాలకు శంకుస్థాపన చేసేందుకు మంగళవారం నామక్కల్ పర్యటనకు బయలుదేరుతున్నారు. నామక్కల్ పరమత్తివేలూరులోని ఉద్యానవనంలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. బొమ్మైకుట్టమేడు సభలో రూ.810కోట్లతో పూర్తయిన పథకాలను ప్రారంభించనున్నారు. ఆ సందర్భంగా వివిధ పథకాలకింద 16వేలమంది లబ్దిదారులకు సహాయాలు పంపిణీ చేయనున్నారు.

### తాంబరం కార్పొరేషన్ సమావేశంనుంచి అన్నాడీఎంకే వాకౌట్

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంబంధ పనులు సక్రమంగా చేపట్టడం లేదంటూ ఆరోపిస్తూ తాంబరం కార్పొరేషన్ సమావేశం నుంచి అన్నాడీఎంకే కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. తాంబరం కార్పొరేషన్ అత్యవసర కౌన్సిల్ సమావేశం సోమవారం మేయర్ వసంతకుమారి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న అన్నాడీఎంకే సభ్యులు మాట్లాడుతూ.. తమ వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని, సమస్యలను పరిష్కరించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష నేత సేలయూర్ శంకర్ అధ్యక్షతన అన్నాడీఎంకే కౌన్సిలర్లు వాకౌట్ చేశారు. అనంతరం సేలయూర్ శంకర్ మీడియాతో మాట్లాడుతూ... తాంబరం కార్పొరేషన్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ప్రజలకు సంబంధించింది కాదని, ఇది కేవలం దీపావళి వసూళ్ల కోసం ఏర్పాటు చేసిందని ఆరోపించారు. తాంబరం కార్పొరేషన్ పరిధిలో ఉన్న ప్రాంతాల్లోని రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో పాటు అంటు వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్, క్రిమిసంహారక మందులు కూడా చల్లలేదన్నారు.

### ఎడప్పాడితో పొత్తుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు

● మంత్రి రఘుపతి

అడయార్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సారథ్యం వహిస్తున్నందుకే ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కెపళనిస్వామితో పొత్తుపెట్టుకునేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదని న్యాయశాఖామంత్రి ఎస్.రఘుపతి అన్నారు. పుదుక్కోట జిల్లా తిరువరంబూరు ముత్తుమారియమ్మన్ ఆలయంలో హిందూ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రి రఘుపతి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, రాష్ట్రంలో ప్రతి రాజకీయ పార్టీ ద్రావిడ పేరుతోనే మనుగడ సాగిస్తున్నాయన్నారు. ఏయే పార్టీ స్థాపించిన ఆ పార్టీ పేరులో ద్రావిడం ఉంటుందన్నారు. అది ద్రావిడ కళగం కావొచ్చు లేదా ద్రావిడ మున్నేట్ర కళగం కావొచ్చన్నారు. ఒక పార్టీని తామే నిర్వీర్యం చేయాలని పని లేదన్నారు. ఆ పార్టీ నాయకత్వం బలహీనంగా ఉన్న పక్షంలో స్వతహాగా ఆ పార్టీనే విచ్ఛిన్నమైపోతుందన్నారు. ఆ ప్రకారంగా చూస్తే ఇపుడు ఎడప్పాడి సారథ్యంలోని అన్నాడీఎంకే నాయకత్వం బలహీనంగా ఉందన్నారు. పైగా ఎడప్పాడితో చేతులు కలిపేందుకు ఏ ఒక్కరూ ముందుకు రావడం లేదని మంత్రి రఘుపతి అన్నారు.

### పనిచేయని ఏసీ : ప్రయాణికుల ఆగ్రహం

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ నుంచి ఆదివారం రాత్రి 10 గంటలకు కోయంబత్తూరుకు వెళ్లే చేరన్ ఎక్స్‌ప్రెస్‌లో సెకండ్ క్లాస్ ఏసీ బోగీలో ఏసీ పనిచేయలేదు. దీంతో, ఆగ్రహించిన ప్రయాణికులు ఎమర్జెన్సీ చైన్ లాగి రైలు నిలిపివేశారు. ఎమర్జెన్సీ చైన్ లాగడంతో ఏం జరిగిందోనని రైల్వే అధికారులు, పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. ఏసీ పనిచేయడం లేదని ప్రయాణికులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. రైల్వే విద్యుత్ ఇంజినీర్లు అక్కడకు చేరుకుని ఏసీ సరిచేయడంతో 55 నిమిషాల ఆలస్యంగా 10.55గంటలకు సెంట్రల్ నుంచి రైలు బయల్దేరి వెళ్లింది.

### కన్నియాకుమారిలో అభివృద్ధి పనులు

● ప్రారంభించిన ఎంపీ విజయ్‌వసంత్

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి లోక్‌సభ సభ్యుడు విజయ్‌వసంత్ విద్యార్థులతో కలిసి అభివృద్ధి పనులు చేపట్టారు. నియోజకవర్గ ప్రజల కోరిక మేరకు పలు గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టేందుకు సొంత నిధులతో ఎక్స్‌కవేటర్‌ను కొనుగోలు చేశారు. కొన్ని ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులతో క్రీడల కోసం ఆసక్తిని పెంచే విధంగా కలుపుమొక్కలు, ముళ్ల పొదలతో ఉన్న మైదానాన్ని శుభ్రం చేయించారు. అనంతరం అనిస్తురిత ఆసుపత్రిలో గుర్తు చికిత్స పొందుతున్న స్వాతంత్ర్య సమరయోధుడు కొడికాన్ షేక్ అబ్దుల్లా కుందిరిని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.



### రిపబ్లిక్ పార్టీ మండల సమావేశం

వేలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా మండల సమావేశం సోమవారం వాలాజాపేటలోని నవీన్ ఫంక్షన్ హాలులో జరిగింది. సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తమిళ్‌అరసన్ అధ్యక్షత వహించగా, జిల్లా అధ్యక్షుడు దళితకుమార్ ప్రారంభించారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి గౌరిశంకర్, రాష్ట్ర నిర్వాహకులు రమేష్ కుమార్, ఏకాంబరం, ధనరాజ్, మల్లిరాజ్ పార్టీ నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చేరివాసన్ రచించిన పుస్తకాన్ని తమిళ్ అరసన్ ఆవిష్కరించారు. సమావేశంలో భాగంగా వేలూరు, తిరుపత్తూర్ సహా పలు జిల్లాల మండల సెక్రటరీలుగా రాణి, దళిత్ గురునాథన్ నియమించారు.



కొత్తగా ఎంపికైన వారిని సత్కరిస్తున్న నిర్వాహకులు

### ఇళ్ల కూల్చివేతపై కలెక్టరేట్ ముట్టడికి యత్నం

చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువేర్కాడు కోలడి చెరువును ఆక్రమించుకుని నిర్మించిన ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చివేయడాన్ని ఖండిస్తూ సుమారు వెయ్యి మంది స్థానికులు కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించారు. కోలడి చెరువు స్థలంలో సుమారు 57 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్టు రెవెన్యూ అధికారులు సర్వేలో తేలింది. దీంతో రెండు రోజులకు ముందు రెవెన్యూ అధికారులు పోలీసుల సాయంతో భవనాలను కూల్చి వేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ సోమవారం ఉదయం ఆ ప్రాంతంలో నివసిస్తున్నవారంతా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా జరిపారు.

# మేం పిలిస్తే ఉదయనిధే వస్తారు!

● మెరీనాలో పోలీసులను దుర్భాషలాడిన జంట

చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మెరీనా బీచ్ సర్వీసు రోడ్డులో గస్తీ తిరుగుతున్న పోలీసులపై పీకలదాకా తాగిన ఓ జంట దుర్భాషలాడింది. అర్ధరాత్రి పూట ఉండకూడదని, త్వరగా ఇంటికి వెళ్లమంటూ సలహా ఇచ్చిన పుణ్యానికి ఆ జంట పోలీసులను దుర్భాషలాడింది. మేం సాధారణ వ్యక్తులం కాము. మేం పిలిస్తే డిప్యూటీ సీఎం ఉదయనిధి క్షణాల్లో వస్తారు అంటూ బెదిరించింది. మెరీనా బీచ్‌లో గస్తీ పోలీసులు అర్ధరాత్రి పూట వాహనాలను తనిఖీ చేయడం ఆనవాయితీ. ఆ ప్రకారం ఆదివారం రాత్రి సర్వీసు రోడ్డులో పార్కింగ్ చేసి ఉన్న కారు వద్దకు వెళ్లి తనిఖీ చేశారు. ఆ కారులో ఓ జంట మద్యం మత్తులో జోగుతుండటం గమనించి, త్వరగా ఇంటికి వెళ్లాలిందిగా సలహా ఇచ్చారు. అంతే ఆ జంట కారు డోర్ తెరుచుకుని చేతులు ఊపుకుంటూ బెదిరిస్తూ పోలీసులను బూతుల వర్షం కురిపించింది. ఆ దృశ్యాన్ని ఓ కానిస్టేబుల్ సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తుండటంతో ఆ జంట ఆసభ్యంగా పోట్లాడి తమను బాగా వీడియో తీయమంటూ రెచ్చగొట్టింది. ఇలా పోలీసులకు పైగా పోలీసులను తిట్టిన ఆ జంట కారులో ఉడాయించింది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ విషయమై గస్తీ విభాగ పోలీసు అధికారి మాట్లాడుతూ.. వీడియోలో నమోదైన ఆ కారు నెంబర్ ఆధారంగా పోలీసులు వారిని గుర్తుపట్టారు. పోలీసుల విచారణలో వారు భార్యాభర్తలు కాదని వెల్లడైంది. పోలీసులు తీవ్ర గాలింపులు జరిపిన మీదట వేళచ్చేరి హోటల్‌లో ఉన్న ఆ జంటను మైలాపూరు పోలీసులు అరెస్టు చేశారు.



పోలీసులను దుర్భాషలాడుతున్న జంట (వీడియో దృశ్యం)

### ఎగ్మూర్ - బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం కేఎస్ఆర్ బెంగళూరు - చెన్నై ఎగ్మూర్ - కేఎస్ఆర్ బెంగళూరు మధ్య ప్రత్యేక సూపర్‌ఫాస్ట్ రైళ్లు నడపనున్నట్టు దక్షిణ రైల్వే తెలిపింది. నెం.06209 కేఎస్ఆర్ బెంగళూరు - చెన్నై ఎగ్మూర్ ప్రత్యేక సూపర్ ఫాస్ట్ స్పెషల్ స్పెషల్ కేఎస్ఆర్ బెంగళూరులో ఈ నెల 30, నవంబరు 3వ తేదీల్లో ఉదయం 8.05 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 2.30 గంటలకు ఎగ్మూర్ చేరుకుంటుంది. నెం.06210 చెన్నై ఎగ్మూర్ - కేఎస్ఆర్ బెంగళూరు ప్రత్యేక స్పెషల్ స్పెషల్ ఈ నెల 30, నవంబరు 3వ తేదీల్లో చెన్నై ఎగ్మూర్ నుంచి 3.55 గంటలకు బయల్దేరి రాత్రి 10.50 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు పెరంబూర్, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పేట, బంగారుపేట, కృష్ణరాజపురం రైల్వేస్టేషన్లలో ఆగనున్నాయి.

ప్రత్యేక రైళ్ల సేవల పొడిగింపు..

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించారు. నెం.06103 తాంబరం - రామనాథపురం ట్రై వీక్లీ స్పెషల్ నవంబరు 2 నుంచి 11వ తేదీ వరకు (గురు, శని, ఆదివారాలు), నెం.06104 రామనాథపురం-తాంబరం స్పెషల్ నవంబరు 3 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు (శుక్ర, ఆది, మంగళవారాలు) పొడిగించారు.

### పప్పు ధాన్యాల సాగు పెంచేలా చర్యలు

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పప్పు ధాన్యాల సాగు పెంచేలా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో యేటా 20 లక్షల ఎకరాల్లో కంది పప్పు, మినపప్పు, పెసర పప్పు, ఉలవలు సహా పలు పప్పు రకాలు 5.22 లక్షల టన్నుల వరకు దిగుబడి అవుతోంది. కానీ రాష్ట్ర అవసరాలకు చాలకపోవడంతో పొరుగు రాష్ట్రాలు, విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఈ క్రమంలో, పూర్తిస్థాయిలో భర్తీ చేసుకొనేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం, గత ఏడాది పప్పు ధాన్యాల ప్రత్యేక పథకం చేపట్టి రూ.138 కోట్లు కేటాయించగా, 4.76 లక్షల మంది రైతులు లబ్ధిపొందారు. వరి కోతలు ముగిసిన తర్వాత సాగు నీరు తక్కువగా ఉన్న భూముల్లో పప్పు దాన్యాలు సాగుచేయాలని ప్రభుత్వం సూచించింది. అందుకోసం రైతులను ప్రోత్సహించేలా రూ.3.35 కోట్లను అందించనుంది. ఈ ఏడాది మరో లక్ష ఎకరాల్లో పప్పు ధాన్యాల సాగు చేపట్టాలని నిర్ణయించినట్టు అధికారులు తెలిపారు.

### రెండు ప్రాంతాల్లో అధునాతన రాడార్లు

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తుఫాన్లు, వర్షాల వివరాలు ఖచ్చితంగా తెలుసుకునేలా రెండు ప్రాంతాల్లో అధునాతన రాడార్లు ఏర్పాటు చేసే పనులను రాష్ట్ర విపత్తుల నిర్వహణ కమిషన్ చేపట్టింది. ప్రస్తుతం చెన్నై, కారైక్కాల్‌లో మాత్రమే రాడార్లు ఉండగా, వాటి సాయంతో దక్షిణ, ఉత్తర జిల్లాల్లో కురిసే వర్షాలను సక్రగా అంచనా వేయలేక పోతున్నారు. ఈ సమస్య అధిగమించేలా సేలం జిల్లా ఏర్కాడు, రామనాథపురం తదితర రెండు ప్రాంతాల్లో రూ.56 కోట్లతో అధునాతన 'సి బ్యాండ్ డాప్లర్ రాడార్లు' ఏర్పాటు చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ రాడార్ల ఏర్పాటుకు అగస్టులో టెండర్లు ఆహ్వానించగా, ప్రస్తుతం సంస్థను ఎంపిక చేసే పనులు జరుగుతున్నాయని, మరో రెండు నెలల్లో పనులు పూర్తిచేయాలని నిర్ణయించినట్టు అధికారులు తెలిపారు.

### ప్రజల ఫిర్యాదుకు 'వాయిస్ ఆఫ్ తాంబరం'

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరం కార్పొరేషన్‌లో తాగునీరు, రోడ్డు వసతి, డ్రైనేజీ సహా పలు సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేసేలా 'వాయిస్ ఆఫ్ తాంబరం' యాప్‌ను కార్పొరేషన్ పరిచయం చేసింది. ఈ యాప్‌ను ఈనెల 15న పురపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. మరో రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి 'వాయిస్ ఆఫ్ తాంబరం' యాప్ ద్వారా ప్రజలు ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు సకాలంలో పరిశీలించి చర్యలు చేపట్టనున్నారు. అలాగే, తాము పంపిన ఫిర్యాదుల విచారణ, పరిశీలన తదితరాలు కూడా ఈ యాప్ ద్వారా ప్రజలు తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

### రోడ్ల డివైడర్ల మధ్య 12 వేల పూల మొక్కలు

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని సుందరీకరించేలా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పలు చర్యలు చేపట్టింది. 'చెన్నై 2.0' పథకంలో కొత్త పార్కుల నిర్మాణం, క్రీడా మైదానాలు, ప్రధాన కూడళ్లలో ఫౌంటెన్లు ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా, ప్రధాన రోడ్ల మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్ల మధ్య పూల మొక్కలు నాటాలని జీసీసీ నిర్ణయించింది. పోరూరు, పడపళ్లి, మందార సహా 12 రకాలకు చెందిన 12,000 మొక్కలు నాటనున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో మొక్కలు నాటిన వెంటనే అనువుగా ఉంటుందని, నీరు లభించి బాగా పెరిగే అవకాశముందని భావించిన కార్పొరేషన్, నవంబరు 15వ తేదీలోపు పనులు పూర్తిచేయాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేసింది.

### జాలరి వలలో చిక్కిన 800 కిలోల తిరుక్కై చేప



పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాశిమేడు జాలరి వలలో 800 కిలోల తిరుక్కై చేప చిక్కింది. పులికాట్ మానం ముగిసి పవని మానం ప్రారంభం కావడంతో ఆదివారం ఉదయం కాశిమేడు నుంచి జాలర్లు చేపల వేటకు వెళ్లారు. వేటకు వెళ్లిన జాలర్లు సాయంత్రం తీరానికి తిరిగొచ్చారు. ఓ జాలరి వలలో 13 అడుగుల పొడవు, 800 కిలోల బరువు కలిగిన భారీ తిరుక్కై చేపను గుర్తించారు. చేప బరువుగా ఉండడంతో క్రేన్ సాయంతో తీరానికి తీసుకొచ్చారు. ఈ చేప వేలం వేసి విదేశాలకు పంపిస్తామని జాలర్లు తెలిపారు.

### రెండు వారాలకు పైగా రోడ్లపై నిలిపి ఉంచే వాహనాల స్వాధీనం

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో రెండు వారాలకు పైగా రోడ్లపై నిలిపి ఉంచే వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ హెచ్చరించింది. జీసీసీ పరిధిలోని 200 వార్డుల్లో ఉన్న రోడ్ల పక్కన ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, మినీ వ్యాన్లను అడ్డదిడ్డంగా నిలిపివేయడంతో పాదచారులు, వాహనదారులకు ఇబ్బంది ఏర్పడుతోంది. మరోవైపు ఫుట్‌పాత్‌లపై వాహనాలు నిలపడం వల్ల పాదచారులు నడవలేని పరిస్థితి. అందువల్ల ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేలా జీసీసీ చర్యలు చేపట్టింది. నగరంలోని రోడ్లపై 15 రోజులకు పైగా నిలిపి ఉంచే వాహనాలను స్వాధీనం చేసుకొని వేలం వేయనున్నట్టు ప్రకటించింది. వాహనాల స్వాధీనం కోసం ప్రత్యేక బృందాలు నిలిపి ఉంచిన వాహనాల నెంబరు ప్లేట్ల ద్వారా వాటి యజమానులను సెల్‌ఫోన్‌లో సంప్రదించి వాహనాన్ని తొలగించాలని ఆదేశిస్తున్నారు. ఇలా రెండు, మూడు సార్లు ఆదేశాలు జారీ చేసిన పక్షంలో వాహనాన్ని స్వాధీనం చేసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో, గత జూలై నెల నుంచి స్వాధీనం చేసుకున్న 1,774 వాహనాల్లో 729 వాహనాలను జరిమానా విధించి యజమానులకు తిరిగి అప్పగించారు. మిగతా 1,045 వాహనాలను త్వరలో వేలం వేయనున్నట్టు అధికారులు తెలిపారు.

### అన్ని రైల్వేస్టేషన్లలో క్యూఆర్ కోడ్ ద్వారా టిక్కెట్లు

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై రైల్వే డివిజన్ పరిధిలోని అన్ని రైల్వేస్టేషన్లలో క్యూ ఆర్ కోడ్ ద్వారా టిక్కెట్లు పొందే విధానం అమల్లోకి వచ్చింది. అన్ రిజర్వుడ్, ప్లాట్‌ఫాం, రిజర్వేషన్ టిక్కెట్లు అని అన్ని రకాల టిక్కెట్లకు కౌంటర్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి యూపీఐ ద్వారా నగదు చెల్లించవచ్చు. నగదు జమ అయినట్టు మెసేజ్ అందిన వెంటనే టిక్కెట్టు అందిస్తారు. కౌంటర్ కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన, చిల్లర సమస్య తదితరాలు అధిగమించేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.

# సృజనాత్మక స్వేచ్ఛతో సినిమా తీయడం ముఖ్యం

● 'వేట్టయన్' సక్సెస్ మీట్‌లో జ్ఞానవేల్



'వేట్టయన్' సక్సెస్ మీట్ దృశ్యం

సృజనాత్మక స్వేచ్ఛతో సినిమాను విజయవంతంగా పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకు రావడం ముఖ్యమని 'వేట్టయన్' దర్శకుడు కేఈ జ్ఞానవేల్ అన్నారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడుగా వచ్చిన 'వేట్టయన్' ఈ నెల 10న విడుదలై భారీ కలెక్షన్లతో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం చెన్నైలో థ్యాంక్స్ గివింగ్ మీట్ నిర్వహించింది. ఇందులో దర్శకుడు జ్ఞానవేల్ మాట్లాడుతూ... 'మంచి కథాంశంతో సినిమాను చేయాలన్న తపనతో నేను చెప్పిన కథ విని, దాన్ని యథాతథంగా దృశ్యరూపంగా వచ్చేందుకు సహకరించిన రజనీకాంత్‌కు కృతజ్ఞతలు. జైలర్ వంటి బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రం తర్వాత ఇలాంటి స్టోరీని ఎంచుకోవడం అంటే మామూలు విషయం కాదు. ఎంతో ధైర్యం కావాలి. ఇదే ఆయన్ను సూపర్‌స్టార్‌గా నిలబెట్టింది. పైగా, 'జైలర్' హిట్ నాపై ఒత్తిడి ఉండకూడదని, నేను అనుకున్న కథను తెరపై ఆవిష్కరించేందుకు, అనుకున్న విధంగా సినిమా పూర్తయ్యేందుకు స్వేచ్ఛనిచ్చిన నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్‌కు ధన్యవాదాలు. ఈ సినిమాను కుటుంబ సమేతంగా చూసి ఎంజాయ్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది' అని పేర్కొన్నారు. నటి రితికా సింగ్ మాట్లాడుతూ... 'ఇంతటి పెద్ద ప్రాజెక్టులో అవకాశం ఇచ్చిన సూపర్‌స్టార్‌కు, దర్శకుడు, నిర్మాణ సంస్థకు ధన్యవాదాలు' అన్నారు.

## యువ నటీనటులకు ప్రతిభా పురస్కారాలు

మహా ఫైన్ ఆర్ట్స్, యునైటెడ్ ఆర్టిస్ట్స్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా వెండితెర, బుల్లితెరకు చెందిన యువ నటీనటులను ఎంపిక చేసి వారికి ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేసింది. వడపళని, కుమరన్ కాలనీలో ఉన్న శిఖరం హాలులో జరిగిన అవార్డుల ప్రదానోత్సవానికి మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్‌కే కృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరవగా, మహా ఫైన్ ఆర్ట్స్ కార్యదర్శి డాక్టర్ అనురాధ జయరామన్, వీఎస్‌పీ స్ట్రాటజిక్ ట్రేడర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ లయన్ డాక్టర్ వి.విజయకుమార్, శిఖరం గ్రూపు ఆఫ్ కంపెనీస్ చైర్మన్ డాక్టర్ ఆర్. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యువ హీరో రాహుల్‌కు 'బెస్ట్ న్యూ ఫేస్ స్పెషల్ అవార్డు', నటి సంజనా సింగ్‌కు 'బెస్ట్ ఫిల్మ్ స్పెషల్ అవార్డు', టీవీ, ఫిల్మ్ నటి అన్నురాణికి 'బెస్ట్ ఫిల్మ్ టీవీ క్యారెక్టర్ స్పెషల్ అవార్డు', యువ డైరెక్టర్ కాళి ముత్తుకు 'బెస్ట్ న్యూ డైరెక్టర్ స్పెషల్ అవార్డు', హీరో, నిర్మాత వి.రాజాకు 'బెస్ట్ న్యూ ఫేస్ స్పెషల్ అవార్డు'ను ప్రదానం చేశారు.



అవార్డు గ్రహీతలతో నిర్వాహకులు

## చిత్రజ్యోతి

### విజయ్ మహానాడుకు ఆహ్వానం లేకున్నా వెళతా

● హీరో విశాల్



విజయ్ - విశాల్

అగ్రహీరో విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) మహానాడుకు ఆహ్వానం లేకపోయినప్పటికీ ఓటరుగా వెళతానని కోలీవుడ్ హీరో విశాల్ అన్నారు. స్థానిక తేనాంపేటలో యాసిడ్ దాడి బాధితుల కోసం సోమవారం కార్యక్రమం జరిగింది. ఇందులో పాల్గొన్న విశాల్ యాసిడ్ దాడి బాధితులకు తన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'ప్రస్తుత రాజకీయ నేతల కంటే విజయ్ ఏం చేయబోతారు అనే విషయాన్ని తెలుసుకునేందుకు టీవీకే మహానాడుకు ఓటరుగా హాజరవుతా. నాకు ఆహ్వానం అక్కర్లేదు. ఎందుకంటే నేను కూడా రాజకీయ నేతనే. ఓటరుగా, ప్రేక్షకుడిగా వెళ్లేందుకు ఆహ్వానం అక్కర్లేదు. టీవీకేలో చేరాలా? వద్దా? అనేది రెండో అంశం. ఆ పార్టీలో చేరే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. సామాజిక స్పృహ కలిగిన ప్రతి ఒక్కరూ రాజకీయ నాయకుడే. ఆ ప్రకారంగా చూసినా నేను కూడా ఓ రాజకీయ నేతనే' అని విశాల్ పేర్కొన్నారు.

## అరుణ్ విజయ్ 'రెట్టతల' షూటింగ్ పూర్తి



యూనిట్ సభ్యులతో అరుణ్ విజయ్ సెల్ఫీ

అరుణ్ విజయ్ హీరోగా రూపొందుతున్న 'రెట్టతల' చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ బీటీజీ యూనివర్సల్ ఓ వీడియో ద్వారా అధికారికంగా వెల్లడించింది. అరుణ్ విజయ్ చివరిగా నటించిన చిత్రం 'మిషన్ చాప్టర్-1'. జనవరిలో విడుదలై హిట్ టాక్‌తో పాటు మంచి కలెక్షన్లను రాబట్టింది. ఆ తర్వాత బాలా దర్శకత్వంలో 'వణంగాన్' చిత్రంలో నటించగా, త్వరలో విడుదలకానుంది. ఈ నేపథ్యంలో అరుణ్ విజయ్ 36వ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని, ఏప్రిల్ 4న సంప్రదాయ పూజా కార్యక్రమంతో 'రెట్టతల' చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. గిరీష్ తిరుకుమరన్ దర్శకుడు. శ్యామ్ సీఎస్ సంగీతం. సిద్ధి ఇద్నానీ హీరోయిన్. బిగ్‌బాస్ బాలాజీ మురుగదాస్ తదితరులు ప్రధాన పాత్రలను పోషించారు. ఇప్పటికే ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేయగా, తాజాగా చిత్రీకరణ పనులు పూర్తి చేసుకున్నట్టు నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా యూనిట్ సభ్యులతో హీరో అరుణ్ విజయ్ దిగిన సెల్ఫీని కూడా షేర్ చేసింది.

## ఈ సారికి వానరాలకే...!

● సీతాఫలాల వేలం రద్దు : అటవీశాఖ



చెట్లకు కాసిన సీతాఫలాలు

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా సింగంపురణి సమీపంలో కొండ ప్రాంతాల్లో సీతాఫలం విరగ్గాసింది. కానీ, కోతులకు ఆహారం అందించేలా ఈ పండ్ల వేలాన్ని అటవీ శాఖ అధికారులు రద్దు చేశారు. ప్రాణమలై, ఒడువన్‌పట్టి, మేలవన్నాయిరుప్పు, సెల్లియంపట్టి తదితర కొండ ప్రాంతాల్లో సీతాఫలం చెట్లు అధికంగా ఉన్నాయి. ఈ ప్రాంతం అటవీ శాఖకు సొంతం కాగా, యేటా సీజన్‌లో సీతాఫలం పండ్లు వేలం వేస్తుంటారు. కానీ, కొంతకాలంగా అటవీ ప్రాంతాల్లో ఆహారం లభించకపోవడవంతో, అక్కడి కోతులు ఆహారం వెతుక్కుంటూ ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాయి. దీన్ని అడ్డుకొనేలా ఈ ఏడాది సీతాఫలం వేలం నిలిపివేసిన అటవీ శాఖ, ఆ పండ్లు ఎవరూ కోయరాదని ప్రకటించింది.



చెన్నై అరివాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన 'మురసొలి' సెల్వం చిత్రపటావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం స్టాలిన్, ద్రవిడ కళగం నేత వీరమణి, మంత్రి దురైమురుగన్, సినీనటుడు సత్యరాజ్, సీనియర్ జర్నలిస్ట్ ఎన్ రామ్ తదితరులు

## ఎనిమిదేళ్ల తర్వాత... పుదుచ్చేరిలో రేషన్ దుకాణాల పునఃప్రారంభం

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో ఎనిమిదేళ్ల అనంతరం సోమవారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రంగస్వామి రేషన్ దుకాణాలను పునఃప్రారంభించారు. ఈ రాష్ట్రంలో ఎరుపు రంగు రేషన్ కార్డులకు 20 కిలోల బియ్యం, పసుపు రేషన్ కార్డులకు 10 కిలోల బియ్యం పంపిణీ చేస్తూ వచ్చారు. 2016వ సంవత్సరం ముఖ్యమంత్రి నారాయణస్వామి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉచిత బియ్యం పంపిణీ వ్యవహారంలో అప్పటి గవర్నర్ కిరణ్ బేదీకి ప్రభుత్వం మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. ఈ వ్యవహారంలో జోక్యం కలుగజేసుకున్న కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, ఉచిత బియ్యానికి బదులు లబ్ధిదారులకు నగదు పంపిణీ చేసింది. ఈ మేరకు కిలో బియ్యానికి రూ.30 నిర్ణయించి పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా, బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు విపరీతంగా పెరిగిన కారణంగా తమకు నగదుకు బదులు బియ్యం పంపిణీ చేయాలని కార్డుదారులు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. 2021వ సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఎన్నార్ కాంగ్రెస్-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రేషన్ దుకాణాలను పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చాయి. అయితే ఈ ఎన్నికల్లో గెలిచి మూడేళ్లు గడిచినా ఆ హామీపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని విపక్షాలు తీవ్రంగా విమర్శించాయి. ఎట్టకేలకు దీపావళి కానుకగా రేషన్ కార్డుదారులకు 10 కిలోల ఉచిత బియ్యం, 2 కిలోల చక్కెర పంపిణీకి సీఎం ఎన్.రంగస్వామి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ ఎంబలం సెల్వం, మంత్రులు నమశ్శివాయం, లక్ష్మీనారాయణ, తేని జయకుమార్, తిరుమురుగన్, శరవణకుమార్, డిప్యూటీ స్పీకర్ రాజవేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్ చౌహాన్, పౌరసరఫరాల శాఖ కార్యదర్శి ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఒక రోజు వర్షానికే తల్లడిల్లిన రాజధాని

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత



చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒక రోజు వర్షానికే చెన్నై నగరవాసులు తల్లడిల్లి పోయారని, వాననీటి తొలగింపులో, బాధితులకు సాయం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విమర్శించారు. కృష్ణగిరి జిల్లాలో జరిగిన పార్టీ ఆవిర్భావ వేడుకలలో, తిరుపత్తూరు జిల్లా ఆంబూరులో జరిగిన బంధువుల ఇంటి వివాహ వేడుకల్లో, సాంగ్రోర్‌కుప్పంలో పార్టీ స్థానిక శాఖ కార్యదర్శి చిత్రపటావిష్కరణ లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల చెన్నై నగరంలో కురిసిన ఒక రోజు వర్షానికే పల్లపు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయన్నారు. ప్రభుత్వ యంత్రాంగం వర్షబాధితులను ఆదుకోవటంలోనూ, వాననీటిని తొలగించడంలోనూ నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శించటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇది ట్రైలర్ మాత్రమేనని డిసెంబర్‌లో మెయిన్ పిక్చర్ (భారీ వర్షాలు ) వస్తే ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టలేక పత్తా లేకుండా పారిపోవడం ఖాయమని విమర్శించారు. ఈ ఆరంభ వర్షానికే జాలర్ల నుండి పడవలను, ట్రాక్టర్లను, మోటరు పంపులను అద్దెకు తీసుకున్న ప్రభుత్వం భారీ వర్షాలు కురిస్తే ఇంకెన్నింటిని అద్దెకు తీసుకుంటుందో తెలియదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గానీ, చెన్నై కార్పొరేషన్ గానీ వర్షబాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టినట్లు ఫొటోలు తీసి వెలువరించాయే తప్ప వాస్తవానికి బాధితులను ఆదుకోవటంలో వైఫల్యం చెందాయన్నారు. తమిళతల్లి ప్రార్థనగీతంలో చోటు చేసుకున్న తప్పిదానికి దూరదర్శన్ అధికారులు క్షమాపణలు తెలపడంతో ఈ వివాదంలో గవర్నర్‌ను ఇరికించడం తగదన్నారు. ఇక డీఎంకే ప్రభుత్వం శాసనసభ ఎన్నికల్లో, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా ఒకటి రెండు పథకాలపైనే విస్తృత ప్రచారం సాగిస్తోందని ప్రేమలత విమర్శించారు.

## రూ.1660 కోట్లకు పెరిగిన సీయూబీ ఆదాయం

● ఎండీ కామకోడి ప్రకటన




చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గత సెప్టెంబర్ 30తో ముగిసిన రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల ప్రకారం సిటీ యూనియన్ బ్యాంక్ ఆదాయం 12 శాతం పెరిగి రూ.1660 కోట్లకు చేరినట్లు ఆ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. కామకోడి ప్రకటించారు. ఇదే విధంగా వడ్డీ రూప ఆదాయం రూ.1304 కోట్ల నుంచి రూ.1434 కోట్లకు పెరిగిందని, వడ్డీయేతర ఆదాయం రూ.182 కోట్ల నుంచి రూ.226 కోట్లకు చేరిందని వివరించారు. ఇక నికర వడ్డీ రూప ఆదాయం 6 శాతం పెరిగి రూ.1061 కోట్ల నుంచి రూ.1,128 కోట్లకు చేరిందని, పన్ను విధింపుల తర్వాత బ్యాంక్ ఆదాయం రూ.508 కోట్ల నుంచి రూ.550 కోట్లకు పెరిగిందని పేర్కొన్నారు. బ్యాంక్‌లో డిపాజిట్లు రూ. 52,714 కోట్ల నుంచి రూ.57.369 కోట్లకు పెరిగిందని తెలిపారు. బ్యాంకు ద్వారా గత యేడాది రూ.43,688 కోట్ల మేరకు రుణాలిచ్చామని, ప్రస్తుతం రుణాల మంజూరు రూ.48,722 కోట్లకు పెంచామని కామకోడి వివరించారు.

## ముగిసిన 'ప్రాక్సిస్' సదస్సు



సదస్సులో పాల్గొన్న వైద్య నిపుణులు, నిర్వాహకులు

అడయార్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు హోమియోపతి మెడికల్ కౌన్సిల్ సహకారంతో వెంకటేశ్వర హోమియోపతిక్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 'ప్రాక్సిస్ 2024' పేరుతో ఒక జాతీయ స్థాయి హోమియోపతిక్ సదస్సు జరిగింది. స్థానిక వడపళనిలోని ఒక హోటల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ సదస్సు ప్రారంభమైంది. ఇందులో మెంబర్ ఫ్యాకల్టీ ఆఫ్ హోమియోపతి (లండన్) డాక్టర్ ఫరూక్ జె మాస్టర్, జీహెచ్ఎంసీ బెంగళూరు ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ కృష్ణ పాల్గొని సందేశాన్ని ఇచ్చారు. ఈ సదస్సు ప్రారంభోత్సవం కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ, సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి అసిస్టెంట్ డైరెక్టర్ (రిటైర్డ్) డాక్టర్ కొల్లి రాజుతో పాటు అనేక మంది వైద్యులు, విద్యార్థులు పాల్గొని సదస్సును జయప్రదం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పారిశుధ్య కార్మికుల మృతి

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మదురైలో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పారిశుధ్య కార్మికులు మృతి చెందారు. మదురై కార్పొరేషన్‌లో ఒప్పంద కార్మికులుగా పని చేస్తున్న నాగరత్నం, లక్ష్మి అనే మహిళలు తమ సహచర ఉద్యోగి ద్విచక్రవాహనంలో విమానాశ్రయం రోడ్డుపై వెళుతున్నారు. ఆ సమయంలో తిరుమంగళం నుంచి మదురై వైపుకు వెళుతున్న లారీ.. ద్విచక్రవాహనం వెనుక భాగాన్ని ఢీకొంది. ఈ ఘటనలో కిందపడిన నాగరత్నం, లక్ష్మి సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పరారైన మృతుల సహచరులు, లారీ డ్రైవర్ కోసం విస్తృతంగా గాలిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వృద్ధుల మృతి

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా ఉసిలంపట్టిలో నడిచి వెళుతున్న పాదచారులపై అదుపుతప్పిన వాహనం ఢీకొనడంతో ఇద్దరు వృద్ధులు మృతిచెందారు. ఉసిలంపట్టికి చెందిన మణి (60) ఆదివారం ఉదయం తేని మెయిన్ రోడ్డులో నల్లంపట్టి ప్రాంతంలో నడిచివెళుతుండగా అటుగా వేగంగా వచ్చిన వాహనం అదుపుతప్పి ఢీకొనడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. అదే విధంగా, ఉసిలంపట్టి-మదురై మెయిన్ రోడ్డులో నడిచివెళుతున్న సెల్వం (66) రోడ్డు దాటే ప్రయత్నంలో లోడు వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. ట్రాఫిక్ విభాగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆన్‌లైన్ యాప్ ద్వారా రుణం యువకుడి ఆత్మహత్య

పెరంబూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ యాప్ ద్వారా రుణం పొందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెంగల్పట్టు జిల్లా హనుమంతపుత్తేరికి చెందిన యువరాజ్-సుభాషిణి దంపతులకు మూడు నెలల కుమార్తె ఉంది. ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న యువరాజ్ (27), కొద్ది నెలల క్రితం ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. ఇంటి ఖర్చుల కోసం ఆన్‌లైన్ యాప్ ద్వారా రుణం తీసుకున్నట్లు తెలిసింది. రుణం తిరిగి కట్టలేని పరిస్థితుల్లో మనస్తాపం చెంది ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## పుట్టగొడుగులు తిన్న ఐదుగురికి అస్వస్థత

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ సమీపంలోని పుట్లూర్ కో-ఆప్టెక్స్ ప్రాంగణం సమీపంలో మొలకెత్తిన పుట్టగొడుగులు తిన్న ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. వరలక్ష్మి, అలమేలు, వెంకటేష్, శరణ్య, శాంతి ఒకే ఇంట్లో నివసిస్తున్నారు. ఆదివారం ఇంటి పెరట్లో మొలచిన పుట్టగొడుగులతో వండిన వంటకాలు తిని విరేచనాలతో బాధపడ్డారు. దీంతో, చుట్టుపక్కల వారు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా తిరువళ్లూర్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## చీర గొంతుకు బిగుసుకుపోయి విద్యార్థి మృతి

ప్యారీస్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్‌లో సరదాగా ఆడుకుంటున్న ప్లస్‌టూ విద్యార్థి గొంతుకు చీర బిగుసుకుపోవడంతో ఊపిరాడక మృతిచెందాడు. విరుదునగర్ ఆళగాపురానికి చెందిన సంతానం కుమారుడు గోకుల్‌రాజ్ (16) ఆ ప్రాంతంలో ఉన్న ఓ మహోన్నత పాఠశాలలో ప్లస్‌టూ చదువుతున్నాడు. ఆదివారం తల్లి చీరను కిటికీలో ఊయలలాగా కట్టి అందులో కూర్చొని ఆట్లాడుతున్న సమయంలో, చీర గొంతుకు బిగుసుకుపోయి ఊపిరాడక సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. చూలకరై పోలీసులు విద్యార్థి మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని విరుదునగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రేలా హాస్పిటల్‌లో తూత్తుకుడి బాలికకు శ్వాసకోశాల మార్పిడి శస్త్రచికిత్స




సమావేశంలో పాల్గొన్న రేలా హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ మహమ్మద్ రేలా

చెన్నై, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేటలోని రేలా హాస్పిటల్‌లో క్షయవ్యాధివల్ల తీవ్రంగా దెబ్బతిన్న ఊపిరితిత్తులతో బాధపడుతున్న 18 యేళ్ల బాలికకు శ్వాసకోస మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆ హాస్పిటల్ చైర్మన్ ప్రొఫెసర్ మహమ్మద్ రేలా తెలిపారు. సోమవారం ఉదయం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తంజావూరులో మెదడు నిర్జీవమైన వ్యక్తి నుంచి సేకరించిన ఊపిరితిత్తులను 2 గంటల 20 నిమిషాల్లో రహదారి మార్గంలో తిరుచ్చికి, అక్కడి నుంచి విమానంలో చెన్నైకి తీసుకువచ్చి సకాలంలో బాలికకు శస్త్రచికిత్స ద్వారా వాటిని అమర్చినట్లు తెలిపారు. కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగం హెడ్ శ్రీనాథ్ విజయశేఖరన్ నేతృత్వంలో డాక్టర్ ఐశ్వర్యా రాజ్‌కుమార్ తదితర వైద్యనిపుణుల బృందం 4 గంటలపాటు శ్వాసకోశాల మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ బాలిక సంపూర్ణంగా కోలుకుందని చెప్పారు.



దిండుగల్ జిల్లా నత్తం శాసనసభ నియోజకవర్గంలో డీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో కలైంజర్ గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి



చెన్నై సచివాలయంలో ఓటర్ల జాబితా సవరణ పనులపై అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యబ్రత సాహు

## ఫరూక్ అబ్దుల్లాకు సీఎం స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు

అడయార్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వృద్ధ రాజకీయ నేతల్లో ఒకరైన జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇదే విషయంపై ఆయన తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధినేత, సీనియర్ రాజకీయ నేతల్లో ఒకరైన ఫరూక్ అబ్దుల్లాకు పుట్టిన రోజు శుభాకాంక్షలు. కశ్మీర్ ప్రజల హక్కుల కోసం ఏమాత్రం చలించకుండా పోరాడే గుణం కలిగిన ఫరూక్ అబ్దుల్లాకు సెల్యూట్ చేస్తూ, ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ళు జీవించాలని ట్వీట్ చేశారు.



## బతుకు 'ఊయల'

అటు బండిపై టిఫిన్ అంగడి. ఇటు ఊయలలో బిడ్డ. బతుకు పనులు చూసుకుంటూ.. ఊయలలో ఏడిచే బిడ్డను సముదాయించేందుకు ఆ తల్లి పడుతున్న వేదన అక్కడి వారిని కదిలించింది. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన నాగరాజు దంపతులు ఏడేళ్ల క్రితం తిరుపతికి వలసొచ్చారు. తిమ్మినాయుడు పాళెం రోడ్డు మలుపువద్ద ఉదయం, సాయంత్రం టిఫిన్ బండి పెట్టుకుంటున్నారు. దీని పక్కనే ఫ్లెక్సీ కోసం ఏర్పాటుచేసిన ఇనుపకమ్మీ, విద్యుత్ స్తంభానికి చీరతో ఊయల కట్టి రెండో కొడుకును పడుకో బెట్టి.. ఆడించుకుంటూ వ్యాపారం చేసుకుంటున్నారామె. - తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

## నడిరోడ్డులోనే 'సిట్టింగ్'

ఎక్కడా చోటే లేదన్నట్టు, నడిరోడ్డులోనే సిట్టింగ్ వేశారు మందుబాబులు. తిరుపతి రూరల్ మంగళం పరిధిలోని తుడా క్వార్టర్స్‌కు వెళ్లే దారిలో సోమవారం మధ్యాహ్నం ఇలా మద్యం సీసాలు, స్నాక్స్ తెచ్చుకుని తాగడం మొదలు పెట్టారు. ఆ సమయంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడ్డారు. ఒకరిద్దరు అడిగితే.. ఎదురుతిరిగారు. మందుబాబులతో గొడవ ఎందుకని వారు వెళ్లిపోయారు. ప్రతి రోజు ఇక్కడ మందుబాబుల వీరంగం ఉంటోందని, స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



## కలెక్టరేట్‌లో 'వర్మీకంపోస్టు'



తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన స్టాల్‌లో వర్మీ కంపోస్టు ప్యాకెట్లను విక్రయించారు. దీనిని పండ్లు, కూరగాయల మొక్కలకు ఎరువుగా వాడుకోవచ్చని ప్రజలు దీనిని ఆదరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. కరకంబాడీ పంచాయతీ నుంచి వర్మీ కంపోస్టును ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నామన్నారు. డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి



# అమ్మ..నాన్న.. తిరుమలా..!

● స్వామితో గొప్ప అనుబంధం నాది అంటున్న దర్శకుడు శ్రీను వైట్ల

'విశ్వం' సినిమా విజయానందాన్ని తిరుమల శ్రీనివాసుడితో పంచుకోవడానికి తిరుమలకు వచ్చారు దర్శకుడు శ్రీను వైట్ల. వెంకీ, దూకుడు, ఆగడు, బాద్‌షా, ఢీ, రెడీ, కింగ్, దుబాయ్ శీను.. వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానం సంపాయించుకున్న ఆయనతో తిరుమలలో ఆంధ్రజ్యోతి ప్రతినిధి సంభాషణలోని ముఖ్యాంశాలు..

- తిరుమల, ఆంధ్రజ్యోతి



### తిరుమల నా ఇల్లు అనిపిస్తుంది

నాకు ఊహ తెలియకముందు అమ్మానాన్నలు తిరుమలకు తీసుకువచ్చారు. పదిహేనేళ్ల వయసు నుంచీ నా తిరుమల ప్రయాణాలన్నీ నాకు గుర్తున్నాయి. నా సొంత ఇంటికి వచ్చిన ఫీలింగ్ కలుగుతుంది ఇక్కడికి రాగానే. నాకు తెలిసి ప్రతి మనిషికి తిరుమలతో ప్రత్యేక అనుబంధం ఉంటుంది. నా పేరు కూడా శ్రీనివసే! ఇక్కడికి రాగానే ఇతర విషయాలన్నీ మరచిపోతాను. స్వామిని దర్శించుకోగానే ఒక పాజిటివ్ ఎనర్జీ వస్తుంది. నా మనసు బాగాలేనపుడు తిరుమలకు వెళ్తే బావుండునని పిస్తుంది. నేను చేసే ప్రతి పనీ స్వామికి చెప్పి చేయడం అలవాటైపోయింది. నేను చేపట్టిన పని విజయవంతం కావాలని ప్రార్థిస్తుంటా. మనకే దన్నా కావాలన్నా, ఏదన్నా చెప్పుకోవాలన్నా తల్లిదండ్రులే గుర్తుకొస్తారు. నాకు శ్రీవేంకటేశ్వరస్వామి గుర్తుకొస్తాడు. ఆయనతోనే అన్నీ పంచుకుంటా.

### స్వామికి థ్యాంక్స్ చెప్పేందుకు వచ్చాం

ఇటీవల విడుదలైన 'విశ్వం' సినిమా మంచి విజయాన్ని సాధించింది. చాలా గ్యాప్ తర్వాత అత్యంత జాగ్రత్తగా తీసిన సినిమా విశ్వం. చాలా సంతోషంగా ఉంది. స్వామికి థ్యాంక్ చెప్పేందుకు వచ్చాం.

### ప్రసాదాలు అద్భుతం

ప్రసాదాల విషయంలో గతంలో కొంత అసంతృప్తిగా అనిపించింది, ప్రస్తుతం చాలా బాగున్నాయ్. దర్శనం కాగానే ప్రసాదాలు తీసుకున్నా. అద్భుతంగా అనిపించింది.

### మాటే మంత్రమైంది

'విశ్వం' విడుదలైన తర్వాత రివ్యూలు అటుఇటుగా వచ్చాయి. అవన్నీ వ్యక్తుల అభిప్రాయాలు. కానీ ప్రేక్షకుల నోటి మాట ఎంత బలంగా ప్రచారం అయిందంటే.. విడుదలైనప్పటి నుంచి కలెక్షను ఏమాత్రం తగ్గడం లేదు. అదనంగా మరో 300 థియేటర్లు పెరగడం అనేది మామూలు విషయం కాదు. మంచి మాటే మంత్రంలా పనిచేసింది. మంచి సినిమాను శ్రీవేంకటేశ్వరస్వామే కాపాడారు. గోపిచంద్‌తో సహా పృథ్వీ, సునీల్, వెన్నల కిషోర్ అందరూ పర్ఫెక్ట్‌గా చేశారు.

### తర్వాతి చిత్రం కామెడీనే

విశ్వం సినిమా హిట్ కావడానికి ప్రధాన కారణం కామెడీనే అంటున్నారు. నా నుంచి ఫుల్ లెంగ్త్ కామెడీ సినిమాలే ప్రేక్షకులు కోరుకుంటున్నారు. నా తర్వాతి చిత్రం ఫుల్ లెంగ్త్ కామెడీతోనే ఉంటుంది. అందరినీ మనసారా నవ్వించగలుగుతున్నానంటే అది నా అదృష్టం.

## శ్రీవారి ఆలయానికి సమీపంలో ప్రయాణించిన హెలికాప్టర్



తిరుమల, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయానికి సమీపంలో సోమవారం ఓ హెలికాప్టర్ ప్రయాణించడం కలకలం సృష్టించింది. సాధారణంగా ఆలయ ఆగమ శాస్త్రం ప్రకారం గర్భాలయం పైభాగంలో విమానాల రాకపోకలుండకూడదు. అయితే కొద్ది నెలలుగా తిరుమల క్షేత్రం మీదుగా విమానాలు, హెలికాప్టర్లు ప్రయాణిస్తూనే ఉన్నాయి. దీనిపై ఇప్పటికే పలుమార్లు అర్చకులు, ఆగమ పండితులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తిరుమలను నోఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాలని టీటీడీ గతంలో అనేకసార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. అయితే నోఫ్లయింగ్ జోన్‌గా తిరుమలను ప్రకటించడం సాధ్యం కాదని కేంద్రమూ స్పష్టం చేసింది. కానీ భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని వీలైనంతవరకు తిరుమల క్షేత్రం మీదుగా విమానాలు, హెలికాప్టర్లు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటుంటారు. అయితే ఇటీవల తిరుమలపై విమానాలు ప్రయాణిస్తూనే ఉన్నాయి. తాజాగా సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో హెలికాప్టర్ భారీ శబ్దంతో ప్రయాణించడంతో మళ్లీ నో ఫ్లయింగ్ జోన్ అంశం తెరపైకి వచ్చింది. ఈ హెలికాప్టర్‌పై ఉన్న లోగోను పరిశీలిస్తే ఇండియన్ ఆర్మీకి సంబంధించినదిగా తెలుస్తోంది. దీంతో టీటీడీ అధికారులు మౌనంగా ఉండిపోయారు.

# 193కి 131 భూ సమస్యలే

● సమస్యల పరిష్కారానికి నిరసనలు, ఫిర్యాదులు

● పీజీఆర్ఎస్‌కు తరలి వచ్చిన జనం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)'కు 193 అర్జీలు వచ్చాయి. వీటిలో 131 రెవెన్యూకు సంబంధించి భూ సమస్యలే ఉన్నాయి. ప్రతి అర్జీని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, నరసింహులు ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇక, ప్రజా సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ పలువురు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. మిగతా వారు అధికారులకు వినతిపత్రాలిచ్చారు.

### విద్యాసంస్థల ఆవరణలో మద్యం షాపులు తొలగించండి

తిరుపతి నగరం ఎంఆర్‌పల్లె విద్యాసంస్థల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలు తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్ రవి కోరారు. ఎంఆర్‌పల్లి, సీతంరోడ్డు సమీపంలో నిబంధనలు ఉల్లంఘించి విద్యాసంస్థల సమీపంలో మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారన్నారు. దీనివల్ల విద్యార్థుల భద్రతకు ఇబ్బంది కలుగుతుందన్నారు. దీనిపై పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, అశోక్, నరేంద్ర, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.





డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న 108 ఉద్యోగులు

### జీతాల చెల్లింపుల్లో జాప్యం

ఏఈఎమ్ఎస్ సంస్థ 108 నిర్వహణ బాధ్యతలు చేపట్టాక ప్రతి నెలా జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని 108 ఉద్యోగులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. రెండు నెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. ఇలాగైతే కుటుంబాలను ఎలా పోషించాలని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. నాలుగురోజులుగా ఏఈఎంఎస్ సంస్థ ఉద్యోగులకు ఒక ఇంక్రిమెంట్ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. 108 సర్వీసులో ఉన్న ఉద్యోగులకు(ఎంటీటీ, పైలెట్) ఆరోగ్యశాఖ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. 8 గంటల పనివిధానాన్ని అమలు చేయాలన్నారు. ఇక 108 వాహనాలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే నేటి నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 108 జిల్లా ప్రధాన కార్యదర్శి మునిరాజా, అధ్యక్షుడు మహేష్, ఉపాధ్యక్షుడు శ్యామ్, మహిళా నాయకురాలు శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

### రోడ్డు ఆక్రమించిన ఈసీఎల్‌పై చర్యలు తీసుకోండి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న చిందేపల్లి గ్రామస్థులు

ఏర్పేడు మండలం చిందేపల్లికి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును అక్రమంగా మూసివేసిన ఈసీఎల్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని.. ఆ రోడ్డును తమకు వదిలిపెట్టాలని ఆ గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చిందేపల్లె గ్రామానికి పూర్వీకుల నుంచి పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి నుంచి రాచగున్నేరి పంచాయతీ ఛటర్జీ నగర్‌మీదుగా 40 అడుగుల రోడ్డు ఉందన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డును ఈసీఈఎల్ యాజమాన్యం మూసేసి తమను అడ్డుకుంటోందని, ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని వాపోయారు. గ్రామస్థులు వెంకయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

### సచివాలయ సిబ్బందిని పంచాయతీకి అనుసంధానించండి

గ్రామ పంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి అందులోని సిబ్బందిని పంచాయతీకి అనుసంధానం చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బరామయ్య, కిరణ్‌యాదవ్ తదితరులు కోరారు. కలెక్టరేట్ వద్ద వీరు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చినా.. పర్యవేక్షణ, నియంత్రణ లేకపోవడంతో గందరగోళం ఏర్పడిందన్నారు. చాలా పంచాయతీల్లో రెండు నుంచి 5 సచివాలయాలను ఏర్పాటు చేశారని, అవసరానికిమించి ఉద్యోగులు ఉన్నారన్నారు. అలా కాకుండా గ్రామపంచాయతీకి ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి, అక్కడి సిబ్బందిని పంచాయతీకి అనుసంధానం చేయాలన్నారు.



# ముగిసిన టెట్

● చివరి రోజు అభ్యర్థులకు కష్టాలు

● 16 రోజులుగా 9 కేంద్రాల్లో పరీక్షలు



పరీక్ష కేంద్రం వెనుక ప్రవేశ మార్గం వద్ద అభ్యర్థులు

తిరుపతి విద్య, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 16 రోజులుగా సాగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సోమవారంతో ముగిసింది. జిల్లావ్యాప్తంగా 9 కేంద్రాల్లో ఈ నెల 3 నుంచి 21వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. 36,759 మంది నమోదు చేసుకోగా 31,840 మంది హాజరయ్యారు. 4,919 మంది గైర్హాజరయ్యారు. సోమవారం జిల్లాలోని మూడు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. నాగలాపురం శ్రీవెంకటపెరుమాళ్ ఇంజినీరింగ్ కళాశాల, రంగంపేట, రామిరెడ్డిపల్లెలోని అయాన్ డిజిటల్ జోన్, తిరుపతి చెర్లోపల్లిలోని అయాన్ డిజిటల్ జోన్ కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 1,507 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 1,299 మంది పరీక్షలకు హాజరయ్యారు. 208 మంది గైర్హాజరయ్యారు.



పరీక్ష కేంద్రం ఎదుట ప్రధాన మార్గాలను మూసేయడంతో ఖాళీగా ఉన్న ప్రధాన ప్రవేశ మార్గాలు

### అభ్యర్థులకు కష్టాలు

టెట్ పరీక్షల చివరి రోజున తిరుపతి చెర్లోపల్లి అయాన్ డిజిటల్ జోన్‌లో అభ్యర్థులకు కష్టాలు ఎదురయ్యాయి. అనంతపురం, కడప, కదిరి, ధర్మవరం, పుట్టపర్తి, కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాల నుంచి అభ్యర్థులు వచ్చారు. సెల్‌ఫోన్లు, బ్యాగ్‌లను భద్రపరిచేందుకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయడంతో అభ్యర్థులు రెండుచోట్ల క్యూలలో గంటలకొద్దీ వేచి ఉండాల్సి వచ్చింది. పరీక్ష కేంద్రంలోకి రెండు ప్రవేశ మార్గాలు ఉన్నప్పటికీ కేంద్ర వెనుకవైపున్న ఓ చిన్నపాటి మార్గంలోంచి ప్రవేశం కల్పించడంతో అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రంలో తాగునీరు పెట్టలేదని తెలిపారు. పరీక్ష జరుగుతున్న సమయంలో అధికారులు మైకులో సూచనలు చేయడం ఏకాగ్రతకు భంగం కలిగించిందని, సిబ్బంది తమపట్ల దురుసుగా వ్యవరించారని ఆరోపించారు.

## వైసీపీ ఎమ్మెల్సీ దందా కేసు విచారణ వేగవంతం

తిరుమల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను అధిక ధరకు విక్రయించిన కేసు విచారణ వేగవంతంగా జరుగుతోంది. వైసీపీ ఎమ్మెల్సీ జకియా ఖానం బెంగళూరుకు చెందిన భక్తులకు వీఐపీ బ్రేక్ దర్శనం చేయించిన ఘటన ఆదివారం వెలుగుచూసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విజిలెన్స్ వింగ్ అధికారులు నివేదిక మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఏ1గా చంద్రశేఖర్, ఏ2గా జకియా ఖానం, ఏ3గా కృష్ణతేజను చేర్చారు. ఈక్రమంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈకేసులో ఇంకా ఎవరైనా ఉన్నారా, ఎమ్మెల్సీ సిఫార్సులపై ఇంకా ఏవైనా అక్రమాలు జరిగాయా, ఎంత కాలం నుంచి ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయనే అంశాలపై పోలీసులు గోప్యంగా విచారణ చేస్తున్నారు.

### డీఎస్సీ శిక్షణ దరఖాస్తులకు గడువు పొడిగింపు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్సీ విధానంలో ఇస్తున్న ఉచిత డీఎస్సీ శిక్షణ దరఖాస్తులకు ఈనెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి చెన్నయ్య సోమవారం తెలిపారు. అభ్యర్థులు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

## శ్రీసిటీలో ఇద్దరు కార్మికుల మధ్య ఘర్షణ

● ఒకరి మృతి



ముర్ము మృతదేహం

వరదయ్యపాలెం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ చెరివి గ్రామ సమీపంలో మద్యం మత్తులో ఇద్దరు కార్మికుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో జార్ఖండ్ రాష్ట్రం బత్వా గ్రామానికి చెందిన షికారీ ముర్ము(39) మృతి చెందాడు. శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. శ్రీసిటీ పరిధిలో చెరివికి సమీపంలో ఓ కంపెనీ నడుస్తోంది. దీని పక్కనే షెడ్లలో జార్ఖండ్, ఇతర ప్రాంతాలకు చెందిన కార్మికులు నివసిస్తుంటారు. ఈ షెడ్లలో నివసిస్తున్న కాంటాక్టు కార్మికుడు షికారి ముర్ము.. అక్కడే ఉన్న మరో కార్మికుడు విక్రమ్ ముర్ము తల్లిని దూషించాడు. దీనిపై అతడు షికారి ముర్ముతో ఆదివారం రాత్రి ఘర్షణ పడ్డాడు. ఇద్దరు తాగిన మైకంలో కిందపడ్డారు. విక్రమ్‌ముర్ము కొట్టిన దెబ్బలకు షికారి ముర్ము మృతి చెందాడు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.